క్లుప్తంగా

ఎస్పీని కలిసిన నాయకులు



జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్‌ను కలిసిన సొసైటీ చైర్మన్ వీరాస్వామి తదితరులు

పోడూరు: జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో పోడూరు మండలానికి చెందిన పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీని కలిసిన వారిలో పెనుమదం సొసైటీ చైర్మన్ కొర్రపాటి వీరాస్వామి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్య వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ మానవత ర్యాలీ



ర్యాలీ చేస్తున్న మానవత సభ్యులు

పెనుగొండ: మానవత వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ శాంతి కోరుతూ సోమవారం ఆచంట మానవత మండల శాఖ ఆధ్వర్యాన గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆచంట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, మానవత సభ్యులు పాల్గొని ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని, సేవా మార్గంలో నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు శివన్నారాయణ సతీష్ కుమార్, కార్యదర్శి బొక్కా రామకృష్ణ, కోశాధికారి నిమ్మకాయల గంగారావు తదితరులు పాల్గొన్నారు.

పేద రోగికి 'వసుధ' ఫౌండేషన్ ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రామకృష్ణంరాజు

పాలకొల్లు అర్బన్: కీళ్ల వ్యాధితో బాధపడుతున్న మొగల్తూరు మండలం వారతిప్ప గ్రామానికి చెందిన ముదునూరి మాధవరాజుకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ రూ.10 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ సహాయాన్ని క్షత్రియ సంక్షేమ పరిషత్ మాజీ అధ్యక్షుడు కనుమూరి రామకృష్ణంరాజు చేతుల మీదుగా ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు ఇంటి వద్ద సోమవారం అందజేశారు. అలాగే ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు ప్రోత్సాహంతో వసుధ ఫౌండేషన్, కొంత మంది క్షత్రియ దాతల విరాళాలతో నివాస గృహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెన్మెత్స జగపతి సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అభినందనీయం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేసరపల్లి రమేష్‌బాబు అన్నారు. సోమవారం పెనుగొండ ఆదిత్య ఆస్పత్రి ఆధ్వర్యాన ములపర్రులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పలివెల శ్రీను, రాష్ట్ర ఉమెన్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా అరుణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



మొగల్తూరులో వనమల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: శ్రావణ మాసం మొదటి సోమవారంతో పాటు నాగ పంచమి సందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శ్రీశైలం తర్వాత శివలింగాన్ని తాకే అవకాశం ఉండటంతో స్థానిక వనమల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పార్వతి దేవి ఆలయంతో పాటు ముత్యాలపల్లిలోని భువనేశ్వరి సమేత ముక్తేశ్వరి స్వామి ఆలయం, పేరుపాలెం చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, కాళీపట్నంలోని కాళికా సమేత కాలేశ్వరి స్వామి ఆలయంలోనూ అధిక సంఖ్యలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఓట్ల లెక్క తేలింది..!

- పక్కాగా పూర్తయిన ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే
- పాలకొల్లు నియోజకవర్గంలో 1,92,392 మంది ఓటర్లు

యలమంచిలి: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిది. రాజకీయ నాయకుల భవిష్యత్తును తలకిందులు చేయడంతో పాటు దేశ భవిష్యత్తును తలమానికం చేసే శక్తి ఓటుకు ఉందనడంలో అతిశయోక్తి లేదు. మన దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికీ ఓటు హక్కు లభిస్తుంది. దీని కోసం ప్రతి సంవత్సరం ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2024 పేరిట స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. జూలై 21న ప్రారంభమైన ఈ సర్వే సోమవారం (ఆగస్టు 21)తో ముగిసింది. బూత్ స్థాయి అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు గ్రామాల్లో నేరుగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే చేసి పూర్తి వివరాలు సేకరించారు.

రాజకీయ పార్టీలతో సమావేశాలు

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. గ్రామాల్లో ఇంటింటి సర్వేను పాలకొల్లు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కటికదల చిన అప్పారావు దగ్గరుండి పర్యవేక్షించారు. ఇంటింటికీ వెళ్లి ఆయనే ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా రాజకీయ పార్టీలతోనూ సమావేశాలు నిర్వహించారు.

ఏం సర్వే చేశారంటే..

అర్హత ఉండీ 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారిని ఓటర్ల జాబితాలో చేరుస్తారు. వీరి నుంచి ఫారం-6తో పాటు వయస్సు ధ్రువీకరణ పత్రం తీసుకుంటారు. తప్పుల సవరణ, కొత్త ఓట్లు నమోదు, మృతులు, నకిలీ ఓట్లు గుర్తిస్తారు. ఓటర్ల జాబితాలో ఒకటి కన్నా ఎక్కువ సార్లు ఓటు నమోదైనా, శాశ్వతంగా గ్రామం విడిచి వెళ్లిన వారు ఉంటే అలాంటి వారి ఓట్లు కూడా గుర్తిస్తారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో ఫొటో సరిగ్గా కనిపించనట్లయితే మార్చుకునే అవకాశం కల్పిస్తారు. వయస్సులో వ్యత్యాసం ఉన్నా, ఇంటి చిరునామా మార్పు ఉన్నా, వ్యక్తిగత వివరాల్లో మార్పులు, చేర్పులు ఉంటే సవరించుకోవడానికి అవకాశం ఇస్తారు. ఒకే ఇంట్లో పదికి మించి ఎక్కువ ఓట్లు ఉంటే వారిని గుర్తించి, ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసి వారి ఓట్లు నిజమైతే వారికి తాత్కాలికంగా నోషనల్ ఇంటి నెంబర్లు జారీ చేస్తారు. ఓటర్ల జాబితా సవరణకు ఓటరు యాప్ వెర్షన్ 5.1 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, పాతవి తొలగించడం వంటివి యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.



యలమంచిలి మండలం అడవిపాలెంలో బీఎల్వోలతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి (ఫైల్ ఫొటో)

గుర్తించిన ఓట్లు

ఫారం-6లో కొత్తగా ఇచ్చిన ఓట్లు 1,996
ఫారం-7లో మరణించిన వారి ఓట్లు 2,413
ఫారం-8లో అడ్రస్ మార్పులు, గ్రామాంతరం 3,980
ఫిజికల్లీ చాలెంజ్ ఓట్లు 654 (కొత్తగా గుర్తించినవి)
ఫిజికల్లీ చాలెంజ్ ఓట్లు 1,888 (పాతవి)

సర్వే వివరాలు ఇలా..

మండలం	కుటుంబాలు	ఓట్లు
పాలకొల్లు పట్టణం	21,016	53,226
పాలకొల్లు మండలం	23,739	56,622
యలమంచిలి	24,033	56,918
పోడూరు	10,746	25,626
మొత్తం	79,534	1,92,392

ఓటర్ల సర్వే పూర్తయింది



పాలకొల్లు నియోజకవర్గంలో నూరు శాతం ఓటర్ల సర్వే చేయాలనే లక్ష్యంతో గత నెల రోజులుగా అహర్నిశలు పనిచేసి సర్వేను దిగ్విజయంగా పూర్తి చేశాం. సకాలంలో సర్వే పూర్తి చేయడానికి కృషి చేసిన బీఎల్వోలు, బీఎల్ఏలకు అభినందనలు. సర్వేపై పలు దఫాలు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించాం. వారానికి ఒకసారి సమావేశం నిర్వహించి వారి సలహాలు, సూచనలు తీసుకున్నాం. మా దృష్టికి వచ్చిన ఓటర్ల అభ్యంతరాలు, వివరాలను వారికి వివరించి సమస్యలు రాకుండా సర్వే పూర్తి చేశాం.

– కటికదల చిన అప్పారావు, పాలకొల్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్

పారదర్శకంగా ఓటర్ల సర్వే



గ్రామ, వార్డు వలంటీర్ల ప్రమేయం లేకుండా కేవలం బీఎల్వోలతోనే ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేను పూర్తి చేశాం. ఓటు తొలగించాల్సి వస్తే సంబంధిత ఓటర్లకు నోటీసులు ఇచ్చిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని బీఎల్వోలకు స్పష్టంగా ఆదేశాలిచ్చాం. అర్హత ఉన్న ఏ ఓటు కూడా అకారణంగా తొలగించలేదు. 2024 జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తున్నాం. సర్వే అత్యంత పారదర్శకంగా నిర్వహించాం. సర్వేను సకాలంలో పూర్తి చేసిన బీఎల్వోలు, బీఎల్ఏలకు అభినందనలు.

– మాతా సునీల్ కుమార్, తహసీల్దార్, యలమంచిలి

70 శాతం వరినాట్లు పూర్తి

పాలకొల్లు అర్బన్: మండలంలోని 27 గ్రామాల్లో వరినాట్లు 70శాతం పూర్తయినట్లు వ్యవసాయాధికారి కె.రాజశేఖర్ తెలిపారు. రాపాక ఛానెల్, దిగమర్రు పంట కాలువ, గోరింటాడ ఓల్డ్ నెం.2 ఛానెల్ కింద ఉన్న శివారు భూములకు సాగునీరు సక్రమంగా అందక వరినాట్లు ఆలస్యమవుతున్నట్లు ఆయన చెప్పారు. మండలంలోని మొత్తం 10,073 ఎకరాల్లో వరి సాగులో ఉందన్నారు. ఇప్పటి వరకు 8,885 ఎకరాల్లో వరినాట్లు పూర్తయినట్లు తెలిపారు. ఇంకా 1,188 ఎకరాల్లో వరినాట్లు వేయాల్సి ఉందన్నారు.

తణుకు తరలి వెళ్లిన వైఎస్సార్ సీపీ సేవాదళ్ కమిటీలు



ఆచంట నుంచి వెళుతున్న వైఎస్సార్ సీపీ సేవాదళ్ నాయకులు

పెనుగొండ: తణుకులో నిర్వహించిన వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా స్థాయి సమావేశానికి ఆచంట నియోజకవర్గం నుంచి సేవాదళ్ కమిటీలు భారీగా తరలి వెళ్లాయి. సోమవారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పెనుమంట్ర, ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాల నుంచి సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. రాబోయే ఎన్నికల్లో సేవాదళ్ పాత్రపై దిశానిర్దేశం చేయడంతో ఉత్సాహంగా తిరిగి వచ్చారు.

టెండర్ విధానాన్ని రద్దు చేయాలి



వినతి పత్రం సమర్పిస్తున్న కార్మికులు

పెనుగొండ: పంచాయతీలో పనిచేసే కార్మికులకు టెండర్ విధానం రద్దు చేయాలని, వారిని కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పెనుగొండ పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి మహంతికి వినతి పత్రం సమర్పించారు. పంచాయతీ కార్మికులకు హైకోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయడం ద్వారా వారి కుటుంబాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు బంగారు విజయ, లలిత, వాణిశ్రీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నడకను మించిన వ్యాయామం మరొకటి లేదు



వైఎన్ కళాశాలలో వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ఎవరైనా ఎక్కువ కాలం ఫిట్‌గా ఉండాలంటే నడకను మించిన వ్యాయామం మరొకటి లేదని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం ఆయన నరసాపురం వైఎన్ కళాశాలలో కొత్తగా నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ నిత్యం ఈ కళాశాలకు వాకింగ్, రన్నింగ్, తదితర వ్యాయామాలు చేసేందుకు అధిక సంఖ్యలో వచ్చే ప్రజల కోసం రూ.12 లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించామన్నారు. అలాగే నరసాపురం ఒకటో వార్డులోని కుళాయి చెరువు గట్టు వద్ద కూడా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ రెండు ప్రాంతాలను వాకర్స్ వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, కోశాధికారి పోలిశెట్టి శ్రీరఘురామారావు, ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు, కళాశాల డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

హేమజ్యోతికి విద్యార్థుల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పాలకొల్లు ఛాంబర్స్ కళాశాల విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తన రెండు కాళ్లకు తీవ్ర గాయాలై బాధపడుతున్న నరసాపురం వైఎన్ కళాశాల జూనియర్ ఇంటర్ విద్యార్థిని దేవరపు హేమజ్యోతిని ఆదుకునేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. ఆమె వైద్యం నిమిత్తం పాలకొల్లు పట్టణానికి చెందిన ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది, కళాశాల యాజమాన్యం కలిసి రూ.25,245లు, అలాగే శ్రీ చైతన్య స్కూల్ పూర్వ విద్యార్థులు తమ కళాశాల ప్రిన్సిపాల్ ప్రోత్సాహంతో విద్యార్థుల నుంచి రూ.51,620లు నగదు సేకరించారు. ఆదివారం హేమజ్యోతి చికిత్స పొందుతున్న భీమవరం ఆసుపత్రికి వెళ్లిన రెండు కళాశాలల విద్యార్థులు ఆమె బంధువులకు నగదు అందజేశారు. పూర్వ విద్యార్థులు అధికారి సిద్ధార్థ్, శింగంశెట్టి వంశీ మాట్లాడుతూ దాతలు హేమజ్యోతిని ఆదుకోవాలని కోరారు. ఛాంబర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ డి.ప్రసాదరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న జేసీ రామ్‌సుందర్ రెడ్డి

మొగల్తూరు: ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా పూర్తిచేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా గడువు ముగిసిందన్నారు. బీఎల్వోలు చేసిన ఓటర్ల నమోదు, ఫారం 6,7,8లపై ఎటువంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. ఎంత మందిని కొత్త ఓటర్ల జాబితాలో చేర్చారు, ఎంత మంది ఓటర్లను తొలగించారని అడిగి తెలుసుకున్నారు. 80 సంవత్సరాలు పైబడిన ఓటర్ల వివరాలు, 18 సంవత్సరాలు నిండిన ఓటర్ల జాబితాను పరిశీలించారు. మండల స్థాయి అధికారులు, సూపర్ వైజర్లు, బీఎల్ఓలు సమన్వయం చేసుకుంటూ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ జి.అనిత కుమారి, డీటీ నరేష్, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, ఆర్ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేయాలి

నరసాపురం రూరల్: సకాలంలో ఓటర్ల జాబితా సవరణ పూర్తిచేసి త్వరితగతిన ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని జేసీ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం నరసాపురం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, స్పెషల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాలు, వార్డుల వారీగా ఇప్పటి వరకు జరిగిన ఓటర్ల జాబితా సవరణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024లో భాగంగా ఇంటింటి సర్వే నేటితో ముగుస్తున్నందున బీఎల్వోలు, మండలాల ప్రత్యేకాధికారులు సమన్వయంతో రీ వెరిఫికేషన్ చేసుకుని సంబంధిత రిపోర్టులు అన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఫాజిల్, డిప్యూటీ తహసీల్దార్ నాగదేవి, ఆర్ఐ యశోధ తదితరులు ఉన్నారు.

కుక్క దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు



తీవ్రంగా గాయపడిన బొక్కా వెంకట పవన్ సాయి

పోడూరు: పోడూరులో కుక్క దాడి చేయడంతో ముగ్గురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామంలోని పల్లగుంట ప్రాంతానికి చెందిన బొక్కా వెంకట పవన్ సాయి, గండికోట సాలంరాజు, మోటూరి హనుమంతు ఆదివారం తమ ఇళ్ల వద్ద ఆడుకుంటుండగా రోడ్డుపై వెళుతున్న కుక్క దాడి చేసి ముగ్గురినీ తీవ్రంగా గాయపర్చింది. స్థానికుల సమాచారంతో 108 వాహన సిబ్బంది వీరిని చికిత్స నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చిన్నారులకు చికిత్స అందించి ఇళ్లకు పంపించారు. కాగా కుక్క చిన్నారులపై దాడి చేయడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇంకా ఎవరిపైనైనా దాడి చేయవచ్చనే భయంతో ఆ కుక్కను గ్రామస్తులు చంపినట్లు తెలిసింది.

నాడు – నేడులో రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న హెచ్ఎంలు

మొగల్తూరు: మండలంలో నాడు – నేడు పథకం కింద చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను సోమవారం పరిశీలించారు. మండలంలో నాడు – నేడు ఫేజ్ 1లో రూ.3 కోట్లతో 15 పాఠశాలలు, ఫేజ్ 2లో రూ.17 కోట్లతో 46 పాఠశాలలు, 10 అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి పనులు చేపట్టారు. దీనిలో భాగంగా ఎంఈవో 1 పుష్పరాజ్యం, ఎంఈవో 2 యు.శామ్యూల్ జాన్ సంయుక్త ఆధ్వర్యంలో నలుగురు ప్రధానోపాధ్యాయులతో కూడిన బృందం రికార్డులను పరిశీలించింది. అధికారుల ఆదేశాల మేరకు నాడు – నేడులో పూర్తయిన పనులు, వివిధ దశల్లో ఉన్న పనులతో పాటు ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధుల వివరాలతో కూడిన రికార్డులు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తున్నామని ఎంఈవో 2 శామ్యూల్ జాన్ తెలిపారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు



సరిపల్లి పద్మశ్రీ కాలనీలో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పలు గ్రామాలు, నరసాపురం పట్టణంలో చేపట్టిన వివిధ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సరిపల్లి గ్రామానికి రూ.20 లక్షల నిధులు కేటాయించారు. వాటిలో రూ.10 లక్షలతో ఇప్పటికే సరిపల్లి సచివాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మించగా, మరో రూ.10 లక్షలతో సరిపల్లి పద్మశ్రీ కాలనీలో లోతట్టుగా ఉన్న ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం పనులు చేపట్టారు. తరచూ అధిక వార్షాలు, వరదల సమయంలో ఈ రోడ్డులో నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గతంలో ఈ ప్రాంతవాసులు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేసి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఏఈ నాగేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వంశీ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ ఈదా సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు చిన్నం వెంకట్రావు తదితరులు పరిశీలించారు.

స్పందనకు 26 ఫిర్యాదులు



సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 26 ఫిర్యాదులు అందాయని కార్యాలయ ఏవో యేడిద శ్రీనివాస్ తెలిపారు. వాటిల్లో నరసాపురం పట్టణం కంబాలవారి వీధికి చెందిన జల్లి జయరాజు తనకు ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు, కొప్పర్రుకు చెందిన విజయకుమార్ అనే వ్యక్తి తన వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బు తీసుకుని నిర్మాణం పూర్తి చేయలేదని, గొంది గ్రామంలో పంచాయతీ చెరువును ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణాలు తొలగించి చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలంటూ గ్రామానికి చెందిన అంగాడి నర్సింహస్వామి తదితరులు ఫిర్యాదులు చేశారు. బాడవ గ్రామానికి చెందిన అలవల కనకదుర్గ తాగునీరు, విద్యుత్ సమస్యపైనా, తూర్పుతాళ్లుకు చెందిన కొణతం పరమేశ్వరరావు తన వద్ద భూమి కొనుగోలు చేసిన వ్యక్తి డబ్బు ఇవ్వకుండా తనను మోసం చేశాడని ఇలా పలు ఫిర్యాదులు, సమస్యలపై డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుండి ఫిర్యాదులు అందాయి.

వైఎస్సార్ సీపీ పాలకొల్లు పరిశీలకునిగా బలరాం

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ పరిశీలకునిగా ఏలూరుకు చెందిన పార్టీ నేత మధ్యాహ్నపు బలరాం నియమితులయ్యారు. సోమవారం వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ప్రకటన వెలువడింది. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు తణుకులో బలరాంను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

వాకర్స్ క్లబ్ చేయూత

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని 10వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన ర్యాలీ రామారావు కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులతో బాధపడుతుండగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు రూ.4వేలు విలువ చేసే మందులు, రూ.2 వేలు నగదు రామారావు నివాసానికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో రామారావు మిత్రుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహరావు, క్లబ్ సభ్యులు షేక్ పీర్ సాహెబ్, పోతుల ఉమా శంకరరావు, సోమంచి శ్రీనివాస శాస్త్రి, నంబూరి గంగాపవన్, ఎస్పీ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం



నర్సింహరాజును సత్కరిస్తున్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ పాత్రికేయుడు కేవీఎస్ఎల్ నర్సింహరాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల రీత్యా దూరప్రాంతాలకు వెళ్లి పిల్లలు తమ తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం వల్ల వారికి వృద్ధాప్యం వచ్చేసరికి వృద్ధాశ్రమాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మంకు వాస్తు, జ్యోతిష్య రత్న పురస్కారం



ఆముదాలపల్లి వీరబ్రహ్మం

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం నార్త్ గ్రామానికి చెందిన వాస్తు, జ్యోతిష్యం, పంచాగం రచయితైన ఆముదాలపల్లి వీరబ్రహ్మం వాస్తు, జ్యోతిష్య రత్న పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రతి ఏటా విశ్వకర్మ సేవా ట్రస్ట్ జాతీయ స్థాయిలో అందించే ఈ పురస్కారానికి ఆయనను ఎంపిక చేసినట్లు సోమవారం కుటుంబ సభ్యులు తెలిపారు. జ్యోతిష్యం, వాస్తుతో పాటు సేవా కార్యక్రమాలు చేసే వారిని పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డు ప్రకటిస్తారని వారు తెలిపారు. వచ్చేనెల 10న విజయవాడలో జరిగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో వీరబ్రహ్మంకు పురస్కారంతో పాటు బంగారు నంది బహుకరిస్తారని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రులో సోమవారం పేకాట ఆడుతున్న 5గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై ఎస్.శ్రీనివాస్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.2,380 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యండగండి గ్రామానికి చెందిన 23 ఏళ్ల యువతి ఆదివారం మధ్యాహ్నం 1 గంట సమయం నుంచి కనిపించడం లేదంటూ యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై కే గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసాపురం డివిజన్
9010223729 (ఆచంట)
9010201609 (నరసాపురం)
9505507552 (పాలకొల్లు)
Office mail : tpgadvt@gmail.com